క్లుప్తంగా

నేడు కిసాన్ మేళా

దాచేపల్లి: నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులో కిసాన్ మేళా గురువారం నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖాధికారి బత్తుల శ్రీకృష్ణదేవరాయలు బుధవారం తెలిపారు. రైతులు పండించే పంటలు, దిగుబడులు, పురుగుమందుల వాడకం, వ్యవసాయ ఉత్పత్తులు అంశాలపై రైతులతో శాస్త్రవేత్తలు ముఖాముఖిగా మాట్లాడి పలు సూచన సలహాలు ఇస్తారని చెప్పారు. రైతులు ఈ మేళాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వ్యాయామంతో ఆరోగ్యం

సత్రశాల(రెంటచింతల): ప్రతి రోజు వ్యాయామంతో ఆరోగ్యం కాపాడుకోవచ్చని జల విద్యుత్ శాఖ డైరెక్టర్ సుజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఏపీ జన్‌కో నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఆవరణలోని క్రీడా ప్రాంగణంలో రూ.4 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం మెయిన్ కంట్రోల్ రూమ్ (ఎంసీఆర్)ను సందర్శించి టెయిల్‌పాండ్ అధికారులతో రెండు యూనిట్ల ద్వారా ప్రస్తుతం ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది...ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన రేడియల్ క్రస్ట్‌గేట్లు పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్లు రవీంద్రారెడ్డి(సివిల్ మైడల్), నాగరాజు(హెచ్‌పీసీ), తిరుమల ప్రసాద్(ఎస్ఆర్‌బీహెచ్ఈఎస్), టెయిల్‌పాండ్ ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, ఈఈ నాగరాజు, డెప్యూటీ ఈఈ జయశంకర్, డెప్యూటీ ఈఈ రత్తయ్య, ఏఈ మల్లేష్, జేపీఏ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రెంటచింతల డీటీగా వెంకటరమణ



రెంటచింతల: మండల డెప్యూటీ తహసీల్దార్‌గా జి.వెంకటరమణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ డీటీగా విధులు నిర్వహించిన పిన్నం బ్రహ్మయ్యను దాచేపల్లి బదిలీపై వెళ్లగా, మాచర్ల డీటీగా పని చేస్తున్న వెంకటరమణను ఇక్కడకు వచ్చారు.

మిరియాల సబ్ స్టేషన్‌లో లైన్స్ బ్రేకర్ ప్రారంభం



కారెంపూడి: మండలంలో మిరియాల విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన లైన్స్ బ్రేకర్‌ను కారెంపూడి ఏఈ వీరాంజనేయులు బుధవారం ప్రారంభించారు. బ్రేకర్ ప్రారంభం వలన మిరియాల, ఒప్పిచర్ల, లక్ష్మీపురం గ్రామాలకు త్రీఫేజ్ కరెంటు 24 గంటలు ఉంటుందని దీని వల్ల గ్రామాల్లో చిన్న కుటీర పరిశ్రమలు చిరు వ్యాపారులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లైన్ మెన్ గౌరీ శంకర్, ఆర్‌డీసీ స్టాఫ్ పాల్గొన్నారు.

దూర విద్య ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం



దుర్గి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి దూర విద్య ఇంటర్ ప్రవేశ పరీక్షలకు అనుమతులు లభించినట్లు ప్రిన్సిపాల్ పి.వేణు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏపీఓఎస్ఎస్) ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా దూరవిద్యా విధానంలో ఇంటర్మీడియెట్ చదువుకోవచ్చునని, దీనికిగాను అభ్యర్థి వయస్సు 15 ఏళ్లు దాటిన వారు అర్హులని తెలిపారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత పొంది కనీసం ఒక ఏడాది గ్యాప్ ఉండాలన్నారు. అనివార్య కారణాల వలన చదువు ఆపిన వారు గృహిణులు, వయోజనులు వంటివారికి ఇంటర్మీడియెట్ పూర్తి చేయటానికి ఇది ఒక మంచి అవకాశమని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లై చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9866687226 సంప్రదించాలని కోరారు.

రేపు 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ధర్నా

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో 2003లో ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్‌ల ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన ఉపాధ్యాయులు, పోలీసులు, గ్రూప్–2, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు పాత పెన్షన్ సాధనకై ఈనెల 18వ తేదీన గుంటూరులో నిర్వహించనున్న ధర్నా ను జయప్రదం చేయాలని 2003 డీఎస్సీ టీచర్స్ ఫోరం కన్వీనర్లు సలగాల ప్రసన్నకుమార్, శీలం యలమంద, రాయిడి శ్రీధర్, మూర్తెళ్ల శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పెన్షన్ విధానం అమలులో ఉన్నప్పుడు మొదలైన నియామక ప్రక్రియను అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నూతన పెన్షన్ విధానంలోకి బలవంతంగా తీసుకరాబడ్డామని వివరించారు. ఆట మొదలైన తరువాత నిబంధనలు మార్చకూడదన్న కనీస న్యాయాన్ని కూడా ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ఇచ్చిన మెమో 57 ప్రకారం న్యాయంగా రావలసిన పాత పెన్షన్ ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేస్తున్న ప్రభుత్వానికి నిరసన తెలియ చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నిర్వహిస్తున్న ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ధర్నాకు ఎస్టీయూ ఏపీ సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నట్టు పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్.వి.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్ తెలిపారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ఉండాలి



ర్యాలీలో న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జూనియర్ సివిల్ జడ్జి ప్రవళిక



గురజాలలో జడ్జి శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు

జూనియర్ సివిల్ జడ్జి ప్రవళిక

పిడుగురాళ్ల: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ టి.ప్రవళిక ఆధ్వర్యంలో బుధవారం మధ్యవర్తిత్వం, రాజీ మార్గం నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి టి.ప్రవళిక మాట్లాడుతూ... మధ్యవర్తిత్వం ద్వారా కేసులు, వివాదాలను పరిష్కరించుకునే మార్గాలను, సెక్షన్ 89 సివిల్ ప్రొసిజర్ కోడ్ ప్రకారం ఏదైనా వివాదంలో పరిష్కారానికి ప్రత్యామ్నాయం నివేదించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.కుమారస్వామి, సెక్రటరీ కె.వెంకటేశ్వర్లు, లేడిస్ రిప్రెజెంటేటివ్ పి.నవ్య, ట్రెజరర్ ఎం.లోకేశ్వరి, జాయింట్ సెక్రటరీ పి.మాణిక్యం, న్యాయవాదులు కంభంపాటి కోటేశ్వరరావు, ప్రశాంత్ నాయక్, కె.సాగర్, ఎం.వెంకటేశ్వర్లు, రమేష్ నాయక్, ఐ.పిచ్చయ్య, ఎం.శ్రీనివాసరావు, ఎం.జాకబ్, కోర్టు సూపరింటెండెంట్ ఎం.ప్రభాకర రెడ్డి, పారా లీగల్ వలంటీర్ పి.నవ్య, పి.నాగరాజు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకోవాలి

గురజాల: దేశం కోసం మధ్యవర్తిత్వం అనే ప్రచార కార్యక్రమంలో భాగంగా సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆర్.శరత్‌బాబుల ఆధ్వర్యంలో గురజాల కోర్టు ఆవరణలో మీడియేషన్ స్టాల్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకోడానికి మీడియేషన్ స్టాల్‌ను ఉపయోగించుకోవాలని కక్షిదారులను కోరారు. మధ్యవర్తిత్వం ద్వారా ఇరు పక్షాలకు న్యాయం అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం జడ్జి, న్యాయవాదులు, పోలీసులు కోర్టు సిబ్బంది కక్షిదారులతో కలసి కోర్టు ఆవరణ నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ భాస్కరరావు, లైజన్ పోలీస్ ఆఫీసర్ వెంకటకృష్ణ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోట శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ చీతిరాల కోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, భువనగిరి హనుమంతరావు, శానంపూడి వెంకటేశ్వరరెడ్డి, కేవి నాగార్జున, వై వెంకటేశ్వర్లు, చిరంజీవి, శరత్‌బాబు,ప్రభుదాసు, కనకం ఆదినారాయణ, శ్యామలాదేవి, హరి సత్య నారాయణ, జానీబాషా, ఏ శ్రీనివాసరావు, జక్కా చెన్నకేశవరావు, మందపాటి శ్రీనివాసరెడ్డి, బండి వీరభద్రుడు, జ్ఞాన సుందరి సురేష్, ఎం.ప్రసాదరావు, కే రామకృష్ణ, పూజల వెంకటరామయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలం

పార్టీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు బ్రహ్మారెడ్డి

రెంటచింతల: వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలం అని వారికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం మాచర్ల పార్టీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన బాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా వంచక పాలన చేస్తుందని విమర్శించారు. అధికారం చేపట్టిన వెంటనే ప్రతి వలంటీర్‌కు రూ.10 వేలు చేస్తామని చెప్పిన బాబు వలంటీర్ వ్యవస్థను రద్దుచేయడంతో వేలాది మంది యువత జీవనోపాధిని కోల్పోయినట్లు తెలిపారు. ఈ నెల 21 నుంచి గ్రామ స్థాయిలో మండలంలోని అన్ని గ్రామాలలో సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజల వద్దకు వెళ్లి వివరించాలని కోరారు. మాచర్ల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పాముల సంపూర్ణమ్మ, పార్టీ జిల్లా నాయకులు ఏరువ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ నాయకులు కార్యకర్తలో కలిసి కూటమి ప్రభుత్వం ఏ విధంగా సంక్షేమ పథకాలను ప్రజలకు దూరం చేశాయో వివరించాలన్నారు. మళ్లీ జగనన్నను సీఎంగా చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన నాయకులు నవులూరి చెన్నారెడ్డి, పార్టీ నాయకులు పొట్లపాటి చంద్రారెడ్డి, గాలి ప్రతాప్ రెడ్డి, పేర్ల ముత్తయ్య, గొలమారి శ్రీనివాసరెడ్డి, పేర్ల శివరామ్, మందలపు శ్రీనివాసరెడ్డి, యర్రెద్దు శ్రీనివాసరెడ్డి, గొట్టం భాస్కర్‌రెడ్డి, మంత్రూ నాయక్, గుండా కిశోర్, త్రిపుర నాగేశ్వరరావు, కేశబోయిన నారాయణ, మాచర్ల యాకోబు, పులి కోటిరెడ్డి, ఉమ్మా సైదారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి



ఎస్టీయూ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు నాయక్

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల వలన ఏర్పడిన ఉపాధ్యాయ ఖాళీల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి కె. నాగేశ్వరరావు నాయక్ కోరారు. బుధవారం రెంటచింతల ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో మండలం లోని తుమ్మకోట, పాలువాయి, మంచికల్లు, రెంటాల, గోలి, జెట్టిపాలెం గ్రామాలలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీఎస్సీ ద్వారా ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. తాత్కాలికంగా విద్యా వలంటీర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భాషా పండిట్‌లను స్కూల్ అసిస్టెంట్స్‌గా ప్రమోషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల శాఖాధ్యక్షులు ఎం.బేబి రాణి, ఆర్థిక కార్యదర్శి ఎం.వెంకటేశ్, సీపీఎస్ కన్వీనర్ అహ్మద్ జాని, జిల్లా నాయకులు లేళ్ల శ్రీనివాసరావు, అమల బాబు, శిలార్ అహ్మద్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో దొంగతనాలు అరికట్టండి



మాచర్ల రూరల్: పట్టణ శివారులలోని జగనన్న కాలనీలో పేదలు నిర్మించుకుంటున్న నివాస గృహాలలో తరచూ దొంగతనాలు జరుగుతూ నిర్మాణానికి ఆటంకాలు కలుగజేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్‌కు హౌసింగ్ ఏఈ మరియదాసు బుధవారం వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని స్టేడియం, వినాయకుని గుట్ట, రొంట గుంట బోడు తదితర జగనన్న కాలనీలలో హౌసింగ్ నిర్మాణాలు సాగుతున్నాయని, కాలనీలో నిర్మాణాల సౌకర్యార్థం బోర్లు, మోటార్లును బిగించారని, ఇటీవల బోరు, మోటార్‌ను దొంగిలించారని, గృహ నిర్మాణదారులు తెచ్చుకున్న, ఇసుక, కంకర, సిమెంట్ బస్తాలను కూడా దొంగలు తీసుకువెళ్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విచారణకు హాజరైన గుంటూరు మాజీ మేయర్

యడ్లపాడు: గుంటూరు నగర మాజీ మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు బుధవారం యడ్లపాడు పోలీస్ స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో యడ్లపాడు మండలంలోని చెంగిచుఖాన్‌పేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాద విషయమై విచారణ కోసం వచ్చారు. విచారణలో పొందిన సమాచారం, ఉన్నతాధికారులకు నివేదిస్తామని సీఐ బి.సుబ్బానాయుడు తెలిపారు.

అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఏడీఏ కన్నయ్య



గోదాములో తనిఖీ చేస్తున్న అధికారులు

రెంటచింతల: విత్తనాలు, ఎరువులు విక్రయించే షాపుల నిర్వాహకులు అనుమతులు లేని విత్తనాలు, ఎరువులను రైతులకు విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నెల్లూరు ఏడీఏ కన్నయ్య, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అపర్ణ హెచ్చరించారు. బుధవారం స్థానిక విత్తనాల షాపులలో, ఎరువుల గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ ఏపీలో లైసెన్స్ తీసుకోకుండా రైతులకు విత్తనాలను విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. విత్తనాల షాపు నిర్వహణకు సంబంధించి నిర్వాహకులు ప్రతి సంవత్సరం తప్పనిసరిగా చట్టబద్ధంగా ప్రభుత్వ అనుమతి(లైసెన్స్) తీసుకోవాలని సూచించారు. ఎవరైనా అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలలో రెంటచింతల, క్రోసూరు ఏఓలు కట్టా లక్ష్మారెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతాంగం తాము కొన్న విత్తనాలు పురుగుమందుల బిల్లులను పంట పూర్తిగా అయిపోయే కాలం వరకు భద్రపర్చుకోవాలని వివరించారు. విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని వ్యాపారులకు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ కె.కన్నయ్య, విజిలెన్స్ అండ్ ఎస్ఎస్ఎస్ సీఐ అపర్ణ, క్రోసూరు ఏఓ వేణుగోపాల్, దుర్గి ఏఓ వై అమీర్‌రెడ్డి పాల్గొన్నారు.

కనికరం కలిగిన తల్లి కార్మెల్‌మాత

ఫాదర్ అగస్టీన్



విద్యుత్ కాంతులతో కార్మెల్‌మాత మందిరం

రెంటచింతల: దయ, కరుణ, ప్రేమ, కనికరం కలిగిన తల్లి కార్మెల్‌మాత అని కానుకమాత చర్చి సహాయక గురువులు రె.ఫాదర్ అగస్టీన్ అన్నారు. స్థానిక నాయుడుపేట కాలనీలో గ్రామ మాజీ సర్పంచి గుర్రాల రాజు నిర్మించిన కార్మెల్‌మాత మందిరం 7వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన సమష్టి దివ్యపూజాబలిలో ఫాదర్ అగస్టీన్ భక్తులను ఉద్దేశించి సందేశాన్ని అందించారు. ఈ రోజున కార్మెల్ మాతను, ఆమె దయను, కార్మెలైట్ ఆర్డర్ స్థాపనకు ఆమె అందించిన సహాయాన్ని స్మరించుకుంటారన్నారు. భక్తులు ప్రత్యేక ప్రార్థనల ద్వారా కోరిన వరాలు ఇచ్చే తల్లిగా కార్మెల్‌మాత కొనియాడబడుతుందన్నారు. మందిరం గ్రామానికే ఒక ప్రత్యేకతను తీసుకువచ్చిందని చెప్పారు. సమష్టి దివ్య పూజాబలి అనంతరం మాజీ సర్పంచి గుర్రాల రాజు భక్తులకు ప్రసాదం, తల్లి కార్మెల్ మాత చిత్రపటాలను పంపిణీ చేశారు. కానుకమాత చర్చి విచారణ గురువులు ఏరువ లూర్దు మర్రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన కార్మెల్‌మాత మందిరం వేడుకలలో ఫాదర్ కొణతం ఏలీషారాజు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పరాశక్తి చేయూత

వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు



విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రెంటచింతల: పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేయూతనివ్వనున్నట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు తెలిపారు. బుధవారం మండలంలోని మల్లవరం, జెట్టిపాలెం, పశర్లపాడు, గోలి గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ ప్రారంభం నుంచి విద్యాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారం అందచేయడానికి ముందుంటున్నట్లు చెప్పారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులు తరగతి గదులలో బోధించే విద్యతోనే విజ్ఞానం పెరుగుతుందని దీంతో కుటుంబాలతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎం.రామకృష్ణారెడ్డి, డెప్యూటీ జనరల్ మేనేజర్ జి.మల్లికార్జునరావు, హెచ్‌ఎంలు ఎస్‌కే సైదా, ఎం. శిరీషా, అహ్మద్, జె.మల్లికార్జునరావు, ఆర్.శ్రీలక్ష్మి, ఎం.సురేష్‌బాబు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డీఎంహెచ్ఓ రవి



కంభంపాడు పీహెచ్‌సీ వైద్యశాల రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ రవి

మాచర్ల రూరల్: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు అంటువ్యాధులు వ్యాపించకుండా ఆరోగ్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖాధికారి బి.రవి కోరారు. బుధవారం మండలంలోని కంభంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యశాలలో సకాలంలో అందుబాటులో ఉండాలని సూచించారు. సిబ్బంది ప్రతి గ్రామంలో క్యాంపులు నిర్వహించి శాంపిల్స్‌ను తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రికార్డులు, ఫార్మసీ ల్యాబ్‌ను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ అరుణ్ కుమార్, ఫార్మసిస్టు డి.నాగమణి, ఎన్‌టీ శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఈఓ నరసింహారావు, సిబ్బంది మాధవి, శిరీష, సీసీ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

శుభ్రత ద్వారా డెంగీ నివారించవచ్చు

మాచర్ల రూరల్: పరిసరాల పరిశుభ్రత ద్వారానే అంటువ్యాధులు నివారించవచ్చునని, ముఖ్యంగా దోమలు వ్యాపించకుండా ఉంటే డెంగీ వంటి ప్రమాదకర వ్యాధిని అడ్డుకోవచ్చునని హెల్త్ సూపర్‌వైజర్ డి.మురళీధర్ కోరారు. బుధవారం మండలంలోని ముత్యాలంపాడులో డెంగీ మాసోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యాధి పగటి పూట కుట్టే దోమల ద్వారానే వస్తుందని, దోమలు తాగునీటిలో నిల్వ ఉంటాయని, వారానికి ఒకసారి బావులు, తొట్లు, డ్రమ్ములు శుభ్రం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. చెత్తను కాల్వలో పడవేయకుండా శానిటరీ సిబ్బందికి అందించాలని విజ్ఞప్తి చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

17 మంది జూదరుల అరెస్ట్

కారెంపూడి: పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలంలోని చింతపల్లి గ్రామ శివారులోని తాటి తోపులో పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. పేకాటాడుతున్న 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.1,70,620 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వాసు తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

కార్మికుల సమస్యను వెంటనే పరిష్కరించాలి



ఐలాండ్ సెంటర్‌లోని శిబిరంలో కార్మికులు

పిడుగురాళ్ల: ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజులుగా ఇంజినీరింగ్ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చలనం లేదని, అందుకే బుధవారం పారిశుద్ధ్య కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. సమ్మె కాలపు ఒప్పందాలు వెంటనే అమలు చేయాలని, ఆప్కాస్ సంస్థను రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్‌తో కూడిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మట్టి ఖర్చు కింద రూ.20 వేలు పరిహారం ఇవ్వాలని, ఎలాంటి నిబంధన లేకుండా తల్లికి వందనం, గ్యాస్ సబ్సిడీ, సంక్షేమ పథకాలు ప్రతి కార్మికుడికి అమలు చేయాలని, జీఓ నంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు వేతనలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. సివిల్ సప్లయిస్ ముఠా వర్కర్స్ యూనియన్ నాయులు ఎస్. వెంకట కృష్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు ఓర్సు కృష్ణ, ఆర్‌డీపీ జిల్లా నాయకులు కుమార్, సీఐటీయూ మండల కన్వీనర్ టి.శ్రీనివాసరావు, పారిశుద్ధ్య కార్మికులు మొగిలి ప్రతాప్, బత్తుల రామారావు, బత్తుల అనిల్, గురవయ్య, సురేష్, రాగిరి శ్రీనివాసరావు, కంప చిన వీరమ్మ, దేవరకొండ లక్ష్మి, శౌరమ్మ, ఇంజినీరింగ్ కార్మికులు వేముల శ్రీను, విజయ్, సురేష్, రత్నబాబు పాల్గొన్నారు.